లాడుతూ వుంది. ప్రతి టేబిల్ దగ్గర యువతీ యువకులు జంటలుగా కూర్చొని కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు. ఒక టేబుల్ ముందు కూర్చుని వున్నారు రవీంద్ర, సుమతి. రవీంద్ర మనసు ఆనందంతో ఉప్పొంగిపోతోంది. ఇంత సులభంగా సుమతి తన కోరికను అంగీకరిస్తుందని అతను ఊహించలేదు.

"ఈ రాత్రికి ఈ హోటల్లోనే ఒక సూట్ బుక్ చేశాను. డిన్నర్ తర్వాత కాసేపు రెస్ట్ తీసుకుందాం" అన్నాడు. అతని ఉద్దేశం అర్థమయింది సుమతికి.

"నాకేం అభ్యంతరం లేదు" మెల్లగా తలవంచుకొని చెప్పసాగింది సుమతి. "ఈరోజుల్లో ఆడపిల్ల శీలం చాలా చవక అయిపోయింది. ఒకసారి దాన్ని వదులుకుంటే ఆ తర్వాత పెద్దగా బాధపడవలసిన అవసరం లేదు. ఈ ఉద్యోగం కోసం ఒకసారి లొంగిపోయాను. ఆ ఉద్యోగం నిలబెట్టుకోవడం కోసం యిప్పుడు మరో సారి" అన్నది. మొదట ఆమె చెపుతున్నది అర్థం కాలేదు రవీంద్రకు.

"అంటే...?" అయోమయంగా ప్రశ్నించాడు.

"ఉద్యోగం కోసం మీ తండ్రిగారిని ప్రాధేయపడినపుడు ఆయన నా నుండి కోరింది కూడా యిదే!




అందుకు అంగీకరించాను కాబట్టే ఈ ఉద్యోగం దొరికింది" అన్నది సుమతి. రవీంద్ర నిర్ఘాంతపోయాడు. అతనిలో ఆందోళన ప్రారంభమైంది. మనసంతా వికలమైపోయింది. ఒక్కసారిగా అతనిలోని ఉద్రేకానికి ఆనకట్ట పడిపోయింది. 'తన తండ్రి అనుభవించిన యువతి ఈ సుమతి' అనే ఆలోచన అతని నరాలను చిల్లించసాగింది. దాదాపు పది నిముషాలు మౌనంగా వుండిపోయాడు. ఆ తర్వాత లేచి నిలబడుతూ, "ఐ యాం సారీ! మీరు యింటికి పోవచ్చు" అన్నాడు. ఒక్క క్షణం అతని వైపుచూసి బయలుదేరి వెళ్లిపోయింది సుమతి.

ఆ రాత్రి సుమతి తన డైరీలో యిలా వ్రాసుకుంది.

"నా శీలం కాపాడుకోవడానికి, ఉద్యోగం నిలబెట్టుకో డానికి యింతకంటే మరో మార్గం తోచలేదు. నా కుటుంబ పరిస్థితులు చెప్పకుని ప్రాధేయపడగానే ఉద్యోగం యిచ్చి నాకు మహోపకారం చేసిన వ్యక్తి రామ్మోహనరావుగారు. ఈరోజు నా స్వార్థం కోసం దేవుడి లాంటి ఆయనను ఆయన కొడుకు దృష్టిలో నీచుడిగా, స్త్రీలోలుడిగా చిత్రించవలసి వచ్చింది. మనిషి సెంటిమెంట్లకు దాసుడు. దాని ఆధారంగా ఏదైనా సాధించవచ్చు. దాన్ని ఆయుధంగా చేసుకొని ఈరోజు నా శీలాన్ని కాపాడుకున్నాను. ఆ రామ్మోహనరావుగారు, దేవుడు నన్ను క్షమించు గాక!"




రామారావు, కృష్ణమూర్తి ఇద్దరూ మార్కెట్ నుండి కాయగూరలు సంచుల్లో వేలాడదీసుకుంటూ వస్తున్నారు. దేశ దరిద్రాన్ని, ఆకాశానికి అంటే ధరలను, కుళ్ళిపోయిన రాజకీయాల్ని మనసు తీరా తిడుతూ మధ్యమధ్యలో కృష్ణమూర్తి ముఖం గమనిస్తున్నాడు.

కృష్ణమూర్తి ఆ, ఊ అనటం తప్ప రామారావు మాటల్లో పాలుపంచుకోవడం లేదు. ఇదో రకం.

అంతలో కిరణ్ లూనాపై వస్తూ రామారావును చూసి లూనా ఆపి నమస్కారం చేసి, "అంకుల్ నేను ఇప్పుడు మీ ఇంటివైపే వెళ్తున్నాను. మీరు కూర్చోండి. నేను మీ ఇంటివద్ద డ్రాప్ చేస్తాను." దానికి రామారావు కృష్ణమూర్తిని చూపించి, "ఇద్దరం కలిసే వచ్చాం. కలిసే వెళ్తాం నీవు వెళ్ళు కిరణ్. ఈ వయసులో ఈ మాత్రం బరువు మోసుకుంటూ వెళ్ళటమే ఆనందం." దానికి కిరణ్ జవాబు చెప్పకుండా లూనాపై వెళ్ళిపోయాడు. రామారావు చేసిన పనికి కృష్ణమూర్తి విసుక్కుంటూ, "ఏమయ్యా! ఇప్పుడే చేయి లాగుతోందని అన్నావు. ఆ అబ్బాయి సహాయం చేస్తానంటే ఎందుకు ఒప్పుకోలేదు? పైగా ఆ అబ్బాయి నాన్నది, మనది ఒకటే డిపార్టుమెంటు" అంటూ వాపోయాడు.

దానికి రామారావు చిద్విలాసంగా నవ్వి, "చూడు మూర్తి గారూ, ఆ అబ్బాయి ఇప్పుడు "సహాయం" అనే పేరుతో సంచి తీసుకుని మా ఇంటికి వెళ్తాడు. ఇంటికి సంచి తెచ్చి ఇచ్చినందుకు మా ఆవిడగారు కూర్చోమంటారు. అదీగాక, ఇంజనీర్‌గారి అబ్బాయి కాబట్టి సభ్యత కోసం అమ్మాయిని కాఫీ తీసుకురమ్మంటుంది. మా అమ్మాయి కాఫీ తీసుకువస్తుంది. మా అమ్మాయి అందగత్తె. వయసులో వుంది. కుర్రాడు ఎర్రగా, బుర్రగా వున్నాడు. నవనాగరికతతో మరీ బాగున్నాడు. అమ్మాయిని చూసి హీ... హీ... అంటాడు. తరువాత కాలేజీలో పరిచయాలు, క్లాసులు ఎగ్గొట్టి సినిమాలు, షికార్లు, పార్కులు, ఒంటరి రూములు — కొన్నాళ్ళు పోయాక అమ్మాయి మామిడి కాయలు చాటుగా తింటుంది.

"అప్పుడు వాళ్ల నాన్న దగ్గరికి వెళ్ళి కథంతా ఫ్లాష్ బాక్‌లా వినిపిస్తే — మన డిపార్టుమెంటు ఒకటే అయినా సీటులో డిఫరెన్స్ చూపిస్తాడు. మాది ఇంజనీరింగ్ కులం, మీది క్లరికల్ కులమని వివరిస్తాడు. మీకూ, మాకూ ససేమిరా కుదరదని తెలుగు సినిమా హీరో తండ్రిలా పోజు పెడతాడు. కిరణ్ వర్షాకాలం సూర్యుడవుతాడు. ఒకవేళ కనిపించినా నాకు మీ అమ్మాయికి సంబంధం లేదంటాడు. దాంతో నేను హాస్పిటల్ చుట్టూ తిరగాల్సివుంటుంది. అందుచేత చిన్న సహాయాన్ని తీసుకుని బాధలు కొని తెచ్చుకోవడం నాకు ఇష్టంలేదు" అంటూ ముగించాడు.

కృష్ణమూర్తి యథాప్రకారం ఆ, ఊ, అనటము లేదు. "ఒక్క "వాక్యం" వెనుక ఇంత "కహానీ" వుందా గురువా" అంటూ పరుగులాంటి నడకతో ఇల్లు చేరుకున్నాడు. కారణం తన 16 సంవత్సరాల అమ్మాయికి ఫ్రీగా ట్యూషన్ చెప్పే మదన్ గుర్తుకు వచ్చాడు.